## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ బాలలక్ష్మి సూచించారు. పదో తరగతి పాసైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల మహిళలు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నేటి నుంచి అధికారులకు శిక్షణ

నర్సాపూర్: బూత్‌స్థాయి అధికారులకు గురువారం నుంచి జాతీయ శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామని ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో రోజుకో మండలంలో శిక్షణ చేపడుతామన్నారు. బూత్ స్థాయి అధికారులకు రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈనెల 3వ తేదీన శివ్వంపేట, 4న కొల్చారం, 7న కౌడిపల్లి, 8న నర్సాపూర్ మండలాలకు చెందిన బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. 9న చిలప్‌చెడ్, 10న హత్నూర, 11న వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు చెందిన అధికారులకు రైతు వేదికలలో శిక్షణ ఉంటుందన్నారు.

### చదువుతోనే ఆర్థిక ప్రగతి

ఎంఈఓ వెంకటేశం



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): చదువుతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని ఎంఈఓ వెంకటేశం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా సంఘాల సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సంఘాలలోని సభ్యులు ఓపెన్ స్కూల్ ద్వారా ఎస్సెస్సీ, ఇంటర్‌లో చేరాలని సూచించారు. మహిళలు చదువుతో పాటు ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలపై అవగాహన పెంచుకోవాలని ఏపీఎం గోపాల్ అన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ విఠల్, సీసీలు నిరంజన్, యోహాన్, బాబురావు, హెచ్‌ఎం అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు



రాంచందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును బీజేపీ నాయకులు బుధవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మెదక్ పార్లమెంట్ కన్వీనర్ వర్గంటి రామోహన్ గౌడ్, నాయకులు పురం మహేష్, జక్కిడి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌సింగ్ ఠాకూర్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### హైవేపై కూలిన చెట్టు



తూప్రాన్- నర్సాపూర్ హైవేపై చెట్టు

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్- నర్సాపూర్ జాతీయ రహదారి చండీ శివారులో బుధవారం ఉదయం జాతీయ రహదారిపై చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సంబంధిత హైవే, పోలీస్ సిబ్బంది స్పందించి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

### వారి వివరాలు నమోదు చేయాలి

నర్సాపూర్: గ్రామాల్లో సర్వే ద్వారా సేకరించిన నిరక్షరాస్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ తారాసింగ్ సూచించారు. బుధవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐకేపీ వీఓలకు ఏర్పాటు చేసిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిరక్షరాస్యుల వివరాలు మూడు రోజుల్లో ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. వలంటీర్ల ద్వారా అందరికీ చదవడం, రాయడం నేర్పించాలన్నారు. గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేయని వారిని గుర్తించి పెన్ స్కూల్ విధానం ద్వారా ఉన్నత విద్య చదివేందుకు ప్రోత్సహించాలని ఏపీఎం గౌరిశంకర్ చెప్పారు.

# గుంతల రోడ్లపై తండ్లాటే!

• ఇబ్బంది పడుతున్న గిరిజనులు • పట్టించుకోని అధికారులు



భిక్షపతి తండాకు వెళ్లే రోడ్డు దుస్థితి



జెమ్లా తండా రహదారి

రామాయంపేట(మెదక్): రామాయంపేట, నిజాంపేట మండలాల పరిధిలోని పలు తండాల రహదారులు అధ్వానంగా మారాయి. రెండు మండలాల్లో 23 గిరిజన ఆవాసాలుండగా, వీటిలో నగరం, కిషన్ తండా, జెడ్‌చెరువు, ఖాసీంపూర్ తండా, జెమ్లా తండాలు పంచాయతీలుగా రూపాంతరం చెందాయి. అన్ని తండాలకు తారు రోడ్డు సదుపాయం కల్పిస్తామని గత ప్రభుత్వ ఇచ్చిన హామీ నెరవేరలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పూర్తయిన రహదారుల నిర్మాణం జరగలేదు. రామాయంపేట మండల పరిధిలోని కిషన్ తండా పంచాయతీ పరిధిలో ఉన్న గంగ్యా తండా, పన్యాతండా, సదాశివనగర్ తండా, కాట్రియాల చిన్న తండా, బాపనయ్య తండా, జెమ్లాతండా, సుభాశ్ తండా, రాంచందర్ తండా, కోమటిపల్లి తండాల రహదారులు పాక్షికంగా శిథిలమయ్యాయి. చిన్నపాటి చినుకులు కురిసినా కాలినడకన వెళ్లడానికి సైతం వీలులేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే దూరంలో వాహనాలు పెట్టి కాలినడకన వెళ్లాల్సి వస్తోందని పలు తండాల గిరిజనులు వాపోయారు.

**వాగు పొంగితే రాకపోకలు బంద్**

మండల పరిధిలోని బాయనయ్య తండా, పన్యా తండాల మధ్య ఉన్న రహదారిపై ఏటా వర్షాకాలంలో వాగు పారుతుంది. చిన్నపాటి చినుకులు కురిసినా అటవీ ప్రాంతంలో నుంచి వచ్చే వరద నీటితో వాగు ప్రవహిస్తుంది. దీంతో పక్కపక్కనే ఉన్న ఈ రెండు తండాల మధ్య ప్రయాణాలు స్తంభిస్తాయి. ఈరోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి రెండు తండాల గిరిజనులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా ఫలితం లేదు. దీంతో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి గతంలో ఎంతోమంది ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు.

**ఇబ్బంది పడుతున్నాం**



అక్కన్నపేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సదాశివనగర్ తండా దట్టమైన అటవీప్రాంతంలో ఉంది. మెదక్, రామాయంపేట ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో తండా ఉండగా, రహదారి సదుపాయం లేదు. దీంతో తాము కాలినడకనే వెళ్తున్నాం.

– తిరుపతి, సదాశివనగర్ తండావాసి

**తారు రోడ్డు నిర్మించాలి**



చాలా వరకు తండాల రోడ్లు చెడిపోయాయి. అన్ని తండాలకు తారురోడ్లు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెంటనే తారురోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి. రహదారులు అధ్వానంగా మారడంతో ఇబ్బంది పడుతున్నాం.

– కంలియా, తీన్ నంబర్ తండావాసి

# మురికి కూపంగా పంట కాలువ



పంట కాలువలో మురికి నీరు పారుతున్న దృశ్యం

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన రాయరావు చెరువు పంట కాలువలోకి మురికి నీరు వదలడంతో పంట కాలువ మురికి కూపంగా తయారైంది. దీంతో పంట పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి నీటితో పాటు కొందరు చెత్తాచెదారం, పనికి రాని సామాన్లు పంట కాలువలోకి పారవేస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ నుంచి పంట కాలువను శుభ్రం చేశారని, గతేడాది నుంచి తామే డబ్బులు జమ చేసుకొని పంట కాలువను శుభ్రం చేయించుకున్నామని పలువురు రైతులు తెలిపారు. కాగా మురికి కాలువ నీరు పంట కాలువలోకి కాకుండా ప్రణాళిక తయారు చేయాలని కోరుతున్నారు. ఈవిషయమై సాగు నీటి పారుదలశాఖ ఏఈ మణిభూషన్‌ను వివరణ కోరగా.. పంట కాలువలోకి మురికి కాలువలు వచ్చి కలవకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు చెప్పామని, మరోసారి లేఖ రాసి మురికినీరు కలవకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌ను వివరణ కోరగా, తమ ఇంజినీర్‌ను తీసుకెళ్లి మురికి నీరు వెళ్లేందుకు ఇతర అవకాశం కోసం పరిశీలిస్తామని తెలిపారు.

# సైబర్ నేరగాళ్లతో జర భద్రం



చిన్నశంకరంపేట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణగౌడ్

రేగోడ్(మెదక్)/రామాయంపేట/చిన్నశంకరంపేట/నిజాంపేట/శివ్వంపేట(నర్సాపూర్)/చేగుంట(తూప్రాన్): సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రేగోడ్ ఎస్‌ఐ పోచయ్య విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని మోడల్ స్కూల్‌లో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శివ్వంపేట మండల పరిధిలోని గూడూర్ కేజీబీవీ వసతిగృహంలో విద్యార్థినులకు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్‌ఐ నారాయణగౌడ్ అవగాహన కల్పించారు. నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ రాజేశ్ సైబర్ క్రైం నివారణపై అవగాహన కల్పించారు. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయొద్దని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పవద్దని సూచించారు. చేగుంట మండలంలోని బోనాల్ గ్రామంలో ప్రజలకు ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌ఐ బిక్యానాయక్ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ బాల్‌రాజు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు.

# 'తపస్'తోనే సమస్యలు పరిష్కారం



నార్లాపూర్‌లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు

నిజాంపేట(మెదక్)/వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం తపస్‌తోనే సాధ్యమని నమ్మి ఉపాధ్యాయులు తమ సంఘంలో భారీగా సభ్యత్వాలు తీసుకుంటున్నారని ఆ సంఘం మాసాయిపేట మండల సీనియర్ నాయకులు రంగారెడ్డి, స్వప్నశ్రీ, మండల అధ్యక్షుడు భద్రయ్య, కార్యదర్శి యూన్సి పేర్కొన్నారు. అలాగే నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా నిజాంపేట తపస్ అధ్యక్షుడు ఉమ్లా నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా బాధ్యులు రవీందర్‌రెడ్డి, అర్జున్, ఉమామహేశ్వర్, కృష్ణ గౌడ్, యాదగిరిరెడ్డి, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభను విజయవంతం చేద్దాం

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్‌గౌడ్**



మాట్లాడుతున్న దయాకర్‌గౌడ్

నర్సాపూర్ రూరల్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి దయాకర్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఇతర ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బహిరంగ సభకు జిల్లా, మండల అధ్యక్షులతో పాటు ఆయా స్థాయి నాయకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం**



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను ప్రతి కార్మికుడు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలు, కనీస వేతనాలు, లేబర్ సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలని కోరారు. దశాబ్దాలు గడుస్తున్నా కార్మికులకు శ్రమకు తగిన వేతనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా అన్నికార్మిక వర్గాలు ఏకమై సమ్మెకు సిద్ధం అవవున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు స్వామి, కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్య అందించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం మండలంలోని తునికి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ సందర్భంగా ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 20 నుంచి మహంకాళి ఉత్సవాలు

తూప్రాన్: తూప్రాన్‌లోని ఉజ్జయిని మహంకాళి ఉత్సవాలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. బుధవారం తూప్రాన్‌లో మున్సిపల్ చైర్మన్ పాతూరి గణేష్‌రెడ్డి, నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణ, శ్రీశైలం గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్, శివ్వమ్మ, ఏర్పుల లక్ష్మణ్, రవీంధర్, నారాయణ, కమ్మరి శ్రీధర్, అనిల్, విశ్వరాజ్, నాగరాజు, వెంకటరమణ, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇల్లు

ములుగు(గజ్వేల్): ఇల్లు లేని ప్రతీ ఒక్కరి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని జిల్లా డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ములుగు మండలంలోని ములుగు, క్షీరసాగర్, అన్నసాగర్, జప్తిసింగాయిపల్లి, చిన్నతిమ్మాపూర్, తున్కిబొల్లారం, నర్సాపూర్, కొత్తూరు, కొక్కొండ, బండతిమ్మాపూర్, బండమైలారం గ్రామాల్లో లబ్ధిదారులు, పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు.

# గడువులోగా నిర్మాణాలు ప్రారంభించాలి

**హౌసింగ్ ఏఈ అరుణ్**



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ అరుణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): నిర్ణీత గడువులోగా ఇంటి నిర్మాణాలు ప్రారంభించకపోతే మంజూరైన ఇంటి పత్రాలను తిరిగి తీసుకుంటామని హౌసింగ్ ఏఈ అరుణ్ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ గ్రామానికి 58 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 12 మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. పలువురు లబ్ధిదారులకు అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. గడువు దాటితే మంజూరు పత్రాలు వెనక్కి తీసుకోవాలని ఉన్నతాధికారులు తెలిపారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఉన్నారు.

# పెచ్చులూడుతున్నాయ్..



పెచ్చులూడిన తహసీల్దార్ కార్యాలయం

చిన్నశంకరంపేట(మెదక్): రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయ పైకప్పు పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే కార్యాలయ సమయంలో అయితే ప్రజలు, అధికారులపై పడేవని పలువురు చర్చించుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయ పైకప్పు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

**అదనపు డీఆర్‌డీఓ సరస్వతి**



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు డీఆర్‌డీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా మహిళలకు లక్ష్యం మేరకు బ్యాంక్, స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని అదనపు డీఆర్‌డీఓ సరస్వతి అన్నారు. బుధవారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో అధికారులో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన మహిళా సంఘాలకు తప్పనిసరిగా రుణాలు ఇచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈఆర్థిక సంవత్సరం మండలంలో బ్యాంకు ద్వారా రూ. 29.84 కోట్లు రుణాలు ఇవ్వడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ. 7.70 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రతీ నెల లక్ష్యం మేరకు మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలన్నారు. తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు రమేష్, శ్రీకాంత్, దుర్గయ్య, లక్ష్మి, పురుషోత్తం, నర్సింలు పాల్గొన్నారు.

# కూరగాయ పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లేష్

ములుగు(గజ్వేల్): కూరగాయ పంటల్లో వ్యాధుల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా.మల్లేష్ సూచించారు. ములుగు మండలం తున్కిబొల్లారం రైతు వేదికలో జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఈఓ) ఆధ్వర్యంలో అధికారులు ఉద్యాన పంటలు వ్యవసాయ పద్ధతులపై రైతులకు బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం ములుగు వ్యవసాయ సంచాలకుడు అనిల్ మాట్లాడుతూ.. కూరగాయల సాగులో రైతులు పురుగుల మందులు వాడుతుండటం వల్ల కలుషితమైన కూరగాయల ఉత్పత్తి జరుగుతుందన్నారు. రైతులు ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను పాటించి నాణ్యమైన కూరగాయలను పండించాలని కోరారు. ఉద్యానశాఖ అందించే బిందు తుంపర సేద్య పరికరాలు, కూరగాయల నారు, రక్షిత సేద్యం పందిర్లు, పామ్‌పాండ్, పండ్ల తోటలకు ఉద్యాన ద్వారా అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చదువుతోనే మంచి భవిష్యత్

**అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**



విద్యార్థులతో మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. స్టోర్ రూంలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. నాసిరకం కూరగాయలు తీసుకురావద్దని, విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మిని ఆదేశించారు. విద్యార్థినులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు మండలంలోని ఎల్లారెడ్డిపేటలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.